www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | శనివారం 29, ఆగస్టు, 2026



-వ్యాపారుల మధ్యవర్తిత్వం

- దయసేసి రాయకండి..

- మాపై ఒత్తిడి ఉంటుంది -వ్యవసాయాధికారిపై వార్తల నేపథ్యంలో...

- ఆందోళనలో ఫెర్టిలైజర్ షాప్స్ యజమానులు

- వెంటాడుతున్న తనిఖీల భయం

- పాత్రికేయులను అభ్యర్థించే పనిలో వ్యాపార వర్గాలు

- డబ్బులు ఇచ్చి లైసెన్సులు తీసుకున్న వారిలో గుబులు

# ఏఓ అల్టిమేటం

లైసెన్సుల కోసం పైసలు చెల్లించి అనుమతులు పొందినప్పటికీ పాపం ఎరువులు పురుగు మందుల షాపుల యజమానులు మాత్రం ప్రశాంతంగా ఉండలేకపోతున్నారు . వ్యవసాయ శాఖ అధికారికి కోపం వస్తే దొడ్డిదారిలో పొందిన లైసెన్స్ ల వ్యవహారం ఇబ్బందికరంగా మారే అవకాశాలు ఉంటాయనే భయాందోళన వారిని వెంటాడుతూనే ఉంది. ఈ క్రమంలో వారికి ఏవో ని కంటికి రెప్పలా కాపాడుకునే పరిస్థితులు నెలకొన్నాయి. ఆ అధికారిపై ఈగ వాలినా చూస్తూ ఊరుకోలేం అన్నట్లుగా వ్యవహరిస్తున్న కొందరు వ్యాపారులతీరు హాస్యాస్పదంగానే కనిపిస్తుంది

భద్రాద్రి న్యూస్/ స్పెషల్ ఫోకస్

2 లో..

చెల్లెలికి అన్నీ తానై... అన్నగా నిలిచిన

# అపూర్వ బంధం

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 28 (భద్రాద్రిన్యూస్ ):** తల్లిదండ్రులు చట్ల విజయ్ కుమార్, సునీత దంపతులను రోడ్డు ప్రమాదంలో కోల్పోయిన చెల్లెలు మౌనికకు, అన్నగా మాత్రమే కాకుండా తల్లిదండ్రుల స్థానంలో నిలిచి జీవితానికి అండగా మారాడు చట్ల మణిదీప్ కుమార్. అప్పుడు మణిదీప్ వయసు కేవలం 28 ఏళ్లు. తన జీవితాన్ని తీర్చిదిద్దుకోవాల్సిన ఆ వయసులోనే చెల్లెలి భవిష్యత్తును తన బాధ్యతగా స్వీకరించాడు. తండ్రి ఉంటే ఆడపిల్ల భవిష్యత్తు కోసం ఎలా ఆలోచించేవాడో, అదే బాధ్యతతో కుటుంబ ఆస్తిలో సగం వాటాను చెల్లెలికి ఇచ్చి ఆమె భవిష్యత్తుకు భరోసా కల్పించాడు.



4లో

## సీతారామ ప్రాజెక్టు నీళ్లు సింగభూపాలెం చెరువు నింపాలి



2లో

-కొత్తగూడెం ఎమ్మెల్యే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**జూలూరుపాడు /చంద్రుగొండ (భద్రాద్రి న్యూస్ )ప్రతినిధి:** సీతారామ ప్రాజెక్టు నీటితో సింగభూపాలెం చెరువును నింపాలని సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా ఇరిగేషన్ మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి జూలూరు పాడు మండలం వినోభానగర్ వద్ద సీతారామ ప్రాజెక్టు కాలువ ..

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
శనివారం 29, ఆగస్టు, 2026

# ఏఓ అల్టిమేటం

**మొదటి పేజీ తరువాయి**

ములుగు జిల్లాలోని మారుమూల ఏజెన్సీ మండలంలో పనిచేస్తున్న వ్యవసాయ శాఖ అధికారి పనితీరుపై ఇటీవల పత్రికల్లో వార్తలు వచ్చాయి రైతులకు అందుబాటులో ఉండకుండా వారి అవస్థలను పట్టించుకోకుండా ఏవో వ్యవహరిస్తున్న తీరును వివరిస్తూ వచ్చిన కథనాలుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. తన మీద వార్తలు రావడాన్ని జీర్ణించుకోలేకపోయారు .. ప్రభుత్వపరంగా రైతులకు సంబంధించిన సేవలపట్ల అవగాహన కల్పించే విషయంలో రైతులు అందుబాటులో ఉండే అంశంలో ఏవో పూర్తి స్థాయిలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నట్లుగా వస్తున్న విమర్శలపై పత్రికల్లో వార్తలు ప్రచురితమైతే పనితీరును మెరుగు పరుచుకోవాల్సింది పోయి దొడ్డిదారికు యుక్తలను నమ్ముకున్న ఏవో ఆ దిశగా కదుపుతున్న పావులు విమర్శలకు దారి తీస్తుంది. పత్రికల్లో వార్తలు రాకుండా చూసుకోవాలంటూ ఎరువులు పురుగుమందుల వ్యాపారులపై ఏవో ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం తనపై వార్తలు రాకుండా చూడాల్సిన గురుతరమైన బాధ్యతలను ఫెర్టిలైజర్ షాపులకు అప్పగించిన ఏవో వారిపై ఒత్తిడి తెచ్చారని తెలుస్తోంది. ఏవో అల్టిమేటం నేపథ్యంలో వ్యాపారులు సైతం ఓ అడుగు ముందుకేశారు. పత్రికల్లో వార్తల రావడం వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతాయని వార్తలు రాకుండా చూడాలంటూ అభ్యర్థించడం విశేషం. పత్రికా స్వేచ్ఛను హరించి దిశగా వ్యవసాయ శాఖ అధికారి చేస్తున్న ఇలాంటి సిల్లీ వ్యవహారాలు విమర్శలకు దారి తీస్తున్నాయి ఫెర్టిలైజర్స్ యాజమాన్యం సైతం తమ లొసుగులు లోప భూయిష్టమైన వ్యాపారాల వ్యవహారం వెలుగులోకి రాకుండా ఉండేందుకు గాను ఏవో ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాల్సి వస్తుంది. అయితే ఆ వ్యవసాయ శాఖ అధికారి పరిధిలో ఎక్కడపడితే అక్కడ పెర్టిలైజర్ షాపులకు అనుమతులు లభించడం వెనక ఏవో మొదలుకొని జిల్లా స్థాయి వ్యవసాయ శాఖ పెద్దల వరకు ముడుపులు భారీగానే వెళ్లాయని విమర్శలు నేపథ్యంలో వ్యాపారులు సైతం అదే నిజం అన్నట్లుగా పత్రికల్లో వార్తల రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేయడం విశేషం




# సీతారామ ప్రాజెక్టు నీళ్లు సింగభూపాలెం చెరువు నింపాలి





**మొదటి పేజీ తరువాయి**

రెగ్యులేటర్ ను పరిశీలించారు. ఇరిగేషన్, రెవిన్యూ, తదితర శాఖల అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని మా జిల్లా గుండెను చీల్చుకుంటూ పోతూ మాకు నీళ్లు ఇవ్వకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఈ విషయంలో మేము కొంత వెనుకబడి ఉన్నా నీళ్లు వచ్చేదాకా వదిలి పెట్టేది లేదని అన్నారు. జూలూరుపాడు నుండి డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా చెరువులు నింపుతూ వాగు ద్వారా సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువును నింపాలని డిమాండ్ చేశారు. దీని గురించి మంత్రి తో, ముఖ్యమంత్రి తో చర్చించి సాధించి తీరుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, ఇరిగేషన్ ఈఈ మహేశ్వరరావు,డిఈ చంద్రశేఖర్, ఏఈ శ్రావణి,సుజాతనగర్ ఎంపీడీఓ భారతి, సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి షాబీర్ భాష, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేందర్,జూలూరుపాడు, సుజాతనగర్ కార్యదర్శులు గుండిపిన్ని వెంకటి,కుమారి హనుమంతరావు, ఏఐవైఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చాంద్ పాషా,ఏఐ వైఫ్ మండల సహాయ కార్యదర్శి నాగుల్ మీరా, సీపీఐ పార్టీ నాయకులు లావుడ్యా గోపి,దాత్రు,తాళ్ళూరి పాపారావు,జక్కుల రాములు, బొడ్డు కేశవరావు,రోశయ్య తదితరులు పాల్గొన్నారు..

# డీపీఎస్ వేదికగా అండర్-19 జిల్లా స్థాయి చెస్ పోటీలు



**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 28 (భద్రాద్రిన్యూస్):**

ఈ నెల 30వ తేదీ ఆదివారం గోపాలపురంలోని స్థానిక డీపీఎస్‌లో అండర్-19 బాలబాలికల జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు డీపీఎస్ చైర్మన్ రవీందర్ రెడ్డి గారు తెలిపారు. ఈ పోటీలను ఖమ్మం జిల్లా చెస్ అసోసియేషన్ మరియు తెలంగాణ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన బాలబాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా స్థాయి చెస్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను చెస్ అసోసియేషన్ సభ్యులు టీ. వీరన్న, పి. శివకృష్ణ, పి. మనీష్, డీపీఎస్ డైరెక్టర్ కడారి వినీత రెడ్డి, డీపీఎస్ ప్రిన్సిపల్ రణధీర్, హెచ్ఆర్ హర్షిత తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీపీఎస్ చైర్మన్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా స్థాయి చెస్ పోటీలకు డీపీఎస్ వేదిక కావడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఘనంగా చేపడతామని తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు, క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో మరెన్నో నిర్వహించాలని ఆకాంక్షించారు.

# స్మార్ట్ కిడ్జ్ లో ఆనందోత్సవాలతో రక్షాబంధన్






**వెల్లివిరిసిన ఆత్మీయ సోదర,సోదరీమణుల ప్రేమ**

**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 28( భద్రాద్రిన్యూస్ ):-**

సోదర సోదరీమణుల ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా నిలిచిన రక్షాబంధన్ వేడుకలను శుక్రవారం స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఆనందోత్సవాలతో నిర్వహించారు. ప్రతి తరగతిలో పాఠశాల విద్యార్థులకు బాలికలు రక్షణ కట్టి తమ అనుబంధాన్ని చాటారు. బాలుర ముంజేతికి రక్షాబంధన్ కట్టి, బాలికలు వారికి మిఠాయిలు తినిపించి ఆప్యాయతను చాటారు. విద్యార్థులందరిలో సోదర ప్రేమ వెల్లి విరిసింది. రాఖీలు కడుతున్నంతసేపు బాలుర ముఖాలలో ఆనందం వెల్లివిరిసింది. అదేవిధంగా పాఠశాల పరిసర ప్రాంతాలలోని చెట్లకు విద్యార్థులు రాఖీలు కట్టి తమ వృక్ష బంధాన్ని తెలియజేశారు. దీనితో పాటు పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు, వాచ్మెన్, డ్రైవర్స్, తమ ఫోటోలు ఎల్లప్పుడూ తీస్తున్న ఫోటోగ్రాఫర్స్ కు పాఠశాల విద్యార్థులు రాఖీలు కట్టడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ "విద్యార్థులలో సహోదర ప్రేమ విలువను తెలియజేసేందుకు రక్షాబంధన్ వేడుకలను పాఠశాలలో నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధం... జీవితాంతం నిలిచే ఒక మధురమైన బంధం
చేతికి కట్టే రాఖీ ఒక దారం మాత్రమే కాదు...
ప్రేమకు, నమ్మకానికి, ఆప్యాయతకు ప్రతీకలిఅని,
పురాణాల కాలం నుండి ప్రత్యేకంగా మన దేశంలోని అన్ని ప్రాంతాలలో రక్షాబంధన్ వేడుకలకు మహోన్నత స్థానం ఉందని పేర్కొన్నారు. తోడబుట్టిన సోదరులకే కాకుండా ఇతరులను సోదరులుగా భావించి రాఖీలు కట్టే సంప్రదాయం మనదేశానికే సొంతం అని తెలియజేశారు. రాఖీ పర్వదినం ప్రజలందరిలో అనురాగ ఆప్యాయతలను, ఐకమత్యాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు." ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# వివాహ కార్యక్రమంలో పాల్గొన్న మల్లిబాబు యాదవ్

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 28 (భద్రాద్రిన్యూస్ ):**

కామేపల్లి మండలం పండితాపురం గ్రామాని కి చెందిన బత్తుల రాంబాబు - ఉపేంద్ర ల కుమారుడు చి. నరసింహారావు- చి. ల. సౌ. హరిణి ( ఖమ్మం నగరానికి చెందిన మల్లెపువ్వు దుర్గాప్రసాద్ - శివాని ల కూతురు ) వివాహం స్థానిక శ్రీనివాస కళ్యాణం మండపంలో జరిగిన వివాహ కార్యక్రమానికి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి, కలకాలం చల్లగా అన్యోన్య దాంపత్యంతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అక్కడికి చేరిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు విషయంగురించి ప్రస్తావించంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితుల్లో కష్టంగా ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల విషయంలో కావాలని జాప్యం చేస్తున్నప్పటికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం బిల్లులు చెల్లించడానికి సిద్ధంగా ఉందని, అదేవిధంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు కూడా త్వరలో మంజూరవుతాయి అని మల్లి బాబు యాదవ్ తెలిపారు. కొమ్మినేపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ధరావత్ అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, చల్ల రాజు బత్తుల వీరబాబు మొగిలి శ్రీను చల్ల మల్లయ్య, మంజల సాంబయ్య, గుండ్ల ఏసోబు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# భద్రాద్రి జిల్లా ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిగా చాంద్ పాషా

**జూలూరుపాడు/ చంద్రుగొండ (భద్రాద్రి న్యూస్) ప్రతినిధి:**



అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శిగా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్.కె. చాంద్ పాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ జిల్లా మహాసభల్లో ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం జూలూరుపాడు మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన యువతకు నిరుద్యోగ భృతి అందించాలని, రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషాతో పాటు జిల్లా నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో యువజన సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పోరాటాలు ఉద్ధృతం చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# నాటు సారా తయారుపై పోలీసుల దాడి

**- ఎనిమిది లీటర్ల నాటు సారా స్వాధీనం**

**- అన్నారం తండా శివారులో నాటుసారా తయారీపై పోలీసుల దాడి -**

**- 8 లీటర్ల నాటుసారా స్వాధీనం**

**- నాటు సారా తయారు విక్రయాలపై సమాచారం ఇవ్వండి**

**- చండ్రుగొండ ఎస్సై శివరామకృష్ణ**



**చంద్రుగొండ /జూలూరుపాడు (భద్రాద్రి న్యూస్) ప్రతినిధి:**

మండల పరిధిలోని అన్నారం తండా గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అన్నారం తండా గ్రామంలో ఎస్సై శివరామకృష్ణ ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు ఈ దాడిలో సుమారు 8 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు ఈ సందర్భంగా ఎస్ఐ శివరామకృష్ణ మాట్లాడుతూ మండలంలోని అన్నారం తండా గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తి నుండి ఎనిమిది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు, మండల పరిధిలో ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా లేదా రవాణా చేసినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా తయారీ, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్సై తెలిపారు.

# జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయికి రాఖీ కట్టిన బాలసదన్ బాలికలు**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో రక్షాబంధన్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ చాంబర్ లో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కి సుబేదారిలోని బాలసదన్ బాలికలు రాఖీ కట్టారు. రాఖీ పర్వదిన ప్రాముఖ్యతను జిల్లా కలెక్టర్ వివరిస్తూ అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఆత్మీయతకు, ఆప్యాయతకు అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని వివరించారు. బాల సదన్ బాలికలకు రక్షణగా నిలబడాలని తెలిపారు. ఈ వేడుకలలో బాలికలకు కలెక్టర్ రాఖీ కట్టారు. రక్షాబంధన్ రోజున తనకు రాఖీని కట్టిన బాలికలకు జిల్లా కలెక్టర్ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రాఖీ పర్వదిన సందర్భంగా జిల్లా కలెక్టర్ తో కలిసి వేడుకలు జరుపుకోవడం పట్ల బాలికలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, బాల సదన్ సూపరింటెండెంట్ కళ్యాణి, బాల సదన్ బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.



# సెప్టెంబర్ రెండు నుంచి టిఆర్ఎస్ నిరసనలు

**- ప్రజా సమస్యలపై గెలమెత్తాలి**

**- బిఆర్ఎస్ నాయకుడు లకావత్ గిరిబాబు**

**జూలూరుపాడు/ చంద్రుగొండ (భద్రాద్రి న్యూస్) ప్రతినిధి:**



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకుడు లకావత్ గిరిబాబు ప్రభుత్వాన్ని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ సెప్టెంబర్ 2 నుండి 9వ తేదీ వరకు నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎన్నికల ముందు 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీలు ప్రకటించి, వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. నాటి గ్యారెంటీ కార్డులు నేడు బాకీ కార్డులుగా మారాయని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఈ బాకీ కార్డులను నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ చేరవేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతులకు సకాలంలో యూరియా, సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ, కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడటంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని ధ్వజమెత్తారు. ప్రజల పక్షాన నిలబడి నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు, బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలకు తరలిరావాలని పిలుపునిచ్చారు...

# స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ శ్రీనగర్ లో రాఖీ వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 28 (భద్రాద్రిన్యూస్ ):**

స్థానిక శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్‌లో "రాఖీ పూర్ణిమ" వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో రక్షాబంధన్ వేడుకలలో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలను కట్టి వారందరు వారి లక్ష్యాలను, విజయాలను సాధించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న భారతీయ సాంప్రదాయంలోని రాఖీ పండుగ విశిష్టతను తెలియజేస్తూ రాఖీ(రక్ష) అనగా రక్షణ, బంధన్ అనగా సూత్రం అని అక్కా, చెల్లెలు తమ సోదరులు చేసే ప్రతి మంచి పనిలో విజయాలను సాధించాలని నుదుటన తిలకం దిద్ది చేతికి రక్షాబంధన్ కట్టి హారతి ఇచ్చి, ఆశీర్వాదం తీసుకుంటారని సోదరులు తమ అక్కా, చెల్లెలకు ఎల్లప్పుడు మీకు నేను రక్షణగా ఉంటానని ఆశీర్వదించి, మంచి బహుమతులను అందజేస్తారని స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలను వారి జీవితంలో ఒక భాగంగా పెంపొందిస్తామని తెలియజేస్తూ అందరికి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేసారు. రాఖీ పండగను పురస్కరించుకొని విద్యార్థినులందరూ రాఖీలను తెచ్చి సోదర సమానులైన తమ స్నేహితులకు రాఖీలను కట్టి తమకు రక్షణగా ఉండాలని ఆకాంక్షిస్తూ వారు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఎంతో ఉత్సాహంగా కేరింతలతో గురువుల మధ్యన ఈ రాఖీ వేడుకలలో పాల్గొని అందరిని ఆనందింపజేసి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండా కృష్ణవేణిగారు, ప్రిన్సిపాల్ మరియు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేసారు.

# రెజొనెన్స్ శ్రీనివాస నగర్ పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 28 (భద్రాద్రిన్యూస్ ):**



ఖమ్మం శ్రీనివాస నగర్‌లోని రెజొనెన్స్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఒకరికొకరు రాఖీలు కట్టుకుని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, నీలిమ మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ పండుగ నిలుస్తుందని తెలిపారు. 'రక్ష' అంటే కాపాడటం, 'బంధన్' అంటే బంధం అని అర్థమని, సోదరసోదరీమణుల మధ్య ఉండే అనురాగం, ఆప్యాయతలకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. రాఖీ కట్టే సోదరి తన సోదరుడు విజయపథంలో ముందుకు సాగాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తుందని, సోదరుడు సైతం తన సోదరికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇస్తాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోదరులు తమ సోదరీమణులకు చిరు కానుకలు అందించి, అక్షింతలు వేసి ఆశీర్వదించే సంప్రదాయం ఎంతో గొప్పదని తెలిపారు. 'అన్న అంటే అమ్మలోని మొదటి సగం, నాన్నలోని రెండో సగం' అనే భావనను విద్యార్థులకు వివరిస్తూ, అన్నాచెల్లెళ్ల అనురాగానికి రక్షాబంధనం చిహ్నంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని రక్షాబంధన్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు.

## మాజీ ఎంపీ నామ కు రాఖీ కట్టిన సోదరి ధనమ్మ

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 28( భద్రాద్రిన్యూస్ ):-**



ఖమ్మం నెహ్రూనగర్‌లోని వరలక్ష్మి నిలయం నందు శుక్రవారం రక్షాబంధన్ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావుకు ఆయన సోదరి ధనమ్మ రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సోదరి ధనమ్మ నాగేశ్వరరావును ఆశీర్వదించి, మిఠాయి తినిపించారు. అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.

# నీట్ పి.జి. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. అమలు

**పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు**

**పరిసర ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్.. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 28( భద్రాద్రిన్యూస్) :**
ఆగస్టు 30న ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించనున్న నీట్ పి.జి. -2026 పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 దీఎస్ఎస్-2023 అమలు చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆగస్టు 30న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు పరీక్ష కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుమిగూడరాదని సూచించారు. ఈ సమయంలో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదని, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ప్రచార కార్యక్రమాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలను మూసివేయాలని సూచించారు. పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు చెప్పారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిఘా ఏర్పాటు చేసి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నామని సునీల్ దత్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పోలీసులకు సహకరించాలని పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# తాజుద్దీన్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీ నామ



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 28( భద్రాద్రిన్యూస్ ):-**
బీఆర్ఎస్ పార్టీ ముస్లిం మైనార్టీ విభాగం ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు మహమ్మద్ తాజుద్దీన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం తాజుద్దీన్ స్వగృహానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. తాజుద్దీన్ మృతి వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తాను ఢిల్లీలో ఉండటం వల్ల తాజుద్దీన్‌ను కడసారి చూడలేకపోయానని నామ ఆవేదన వ్యక్తం చేశారు. తాజుద్దీన్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని, కలిసి పనిచేసిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. పార్టీ పట్ల ఎంతో నిబద్ధతతో పనిచేసిన తాజుద్దీన్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అర్ధరాత్రి అయినా స్పందించే వ్యక్తిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడిన నామ, పిల్లల చదువుల గురించి ఆరా తీశారు. కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఏ అవసరం వచ్చినా, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తనకు నేరుగా ఫోన్ చేయాలని సూచించారు. తన సామాజిక వర్గానికే పరిమితం కాకుండా, ఎవరికి ఏ ఆపద వచ్చినా వెంటనే స్పందించి అండగా నిలిచే వ్యక్తిగా తాజుద్దీన్ మంచి పేరు సంపాదించుకున్నారని పరామర్శకు వచ్చిన వారు తెలిపారు. పార్టీ కోసం, ప్రజల కోసం నిబద్ధతతో సేవలందించిన తాజుద్దీన్‌ను కోల్పోవడం తీవ్రంగా బాధించిందని నామ పేర్కొన్నారు. ఆయన మృతి బీఆర్ఎస్ పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొంటూ, తాజుద్దీన్ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కర్నాటి కృష్ణ, షేక్ మక్బుల్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, మాజీ కార్పొరేటర్ బూడిగెం శ్రీను, నాయకులు బాణాల వెంకటేశ్వర్లు, కనకమేడల సత్యనారాయణ, మోరంపూడి ప్రసాద్ రావు, బోజెడ్ల రామ్మోహన్ రావు, తాజద్దీన్, మరికంటి రేణుబాబు, తన్నీరు రవి, రేగళ్ల కృష్ణప్రసాద్, ముబీన్, సద్దాం, రసూల్, ఫిరోజ్, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్-పీజీ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు 668 మంది విద్యార్థులు హాజరు**

**ఉదయం 7:00 గంటల నుంచి 8:30 గంటల వరకు మాత్రమే పరీక్షా హాలులోకి అనుమతి**



**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 28 (భద్రాద్రిన్యూస్ ):-**
ఖమ్మం జిల్లాలో ఆగస్టు 30న ఆదివారం నిర్వహించనున్న నీట్--పీజీ 2026 పరీక్షను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు.జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో నీట్--పీజీ 2026 పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కొణిజర్ల మండలం తనికెళ్లలోని అయాన్ డిజిటల్ జోన్, లక్ష్య కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఒక కేంద్రం, ఖమ్మంలోని పాకబండ బజార్‌లోని స్వర్ణ భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో మొత్తం 668 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష ఆగస్టు 30న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని టీజీఎన్‌పిడీసీఎల్ అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల్లో హెల్త్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసి అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని పోలీస్ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు.పరీక్షల పర్యవేక్షణ కోసం జిల్లాలో రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను ఉదయం 7:00 గంటల నుంచి 8:30 గంటల వరకు మాత్రమే పరీక్షా హాలులోకి అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా కలర్ ప్రింట్ ఔట్ అడ్మిట్ కార్డుతో పాటు ఫోటోతో కూడిన ఒరిజినల్ గుర్తింపు కార్డు, ఎం.బి.బి.ఎస్. పర్మనెంట్/ప్రొవిజనల్ మెడికల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలర్ జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని సూచించారు.'పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, గడియారాలు, ఆభరణాలు, షూస్ అనుమతించబడవని స్పష్టం చేశారు. లివిద్యార్థులు పరీక్షా నిబంధనలను తప్పని సరిగా పాటిస్తూ, ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

# 'సర్వజ్ఞ' సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీక







**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 28 (భద్రాద్రిన్యూస్) :**
నగరంలోని ప్రముఖ విద్యాసంస్థ సర్వజ్ఞ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల రాఖీలను ఒకరికొకరు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సోదర బంధం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు అలరించాయి. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా రాఖీలు తయారు చేసే పోటీలు కూడా నిర్వహించారు. చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ.. "రక్షాబంధన్ కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, సోదర సోదరీమణుల మధ్య ఉన్న అప్యాయత, అనుబంధానికి ప్రతీక" అన్నారు. విద్యార్థులు పరస్పర గౌరవం, స్నేహ భావంతో మెలగాలని వారు ఉద్బోధించారు. ఈ వేడుకలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆనందం వెలిబుచ్చారు. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో సర్వజ్ఞ స్కూల్ నిబద్ధత మరోసారి స్పష్టమైంది. అనంతరం డైరెక్టర్ నీలిమ గారు మాట్లాడుతూ, ఈ రాఖీ కేవలం ఒక దారం కాదు, ఇది సోదర సోదరీమణుల మధ్య ఉండే నమ్మకం, ప్రేమ, రక్షణకు ప్రతీక. ఈ బంధం ఎప్పటికీ చెరిగిపోనిది. ఈ పండుగ మన సంస్కృతిలో ఒక అందమైన భాగం. ఒకరినొకరు రక్షించుకోవాలనే భావాన్ని, జీవితాంతం తోడుగా ఉంటామనే వాగ్దానాన్ని ఇది తెలియజేస్తుంది. ఈ పండుగ కేవలం రక్తం పంచుకున్న బంధాలకే కాకుండా, ఆత్మీయత ఉన్న ఏ ఇద్దరు వ్యక్తుల మధ్యనైనా ఆ బంధాన్ని ధృవీకరించుకోవడానికి జరుపుకోవచ్చు.ఈ రాఖీ పండుగను మనం ఎల్లప్పుడూ ఆనందంగా జరుపుకుందాం అని ఎంతో గొప్పగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. 'సర్వజ్ఞ సోదరి సోదరీమణుల అనుబంధం' అనే నినాదంతో ఈ వేడుకను నిర్వహించారు.

# చెల్లెలికి అన్నీ తానై... అన్నగా నిలిచిన అపూర్వ బంధం

**మొదటి పేజీ తరువాయి**



చెల్లెలికి మంచి కుటుంబం తోడవ్వాలనే ఆకాంక్షతో శ్రీమతి కురపాటి మంజుల, డాక్టర్ కురపాటి వెంకటేశ్వర్లు దంపతుల మొదటి కుమారుడు హర్షవర్ధన్‌తో మౌనిక వివాహాన్ని జరిపించారు. అత్తవారింట్లో చెల్లెలిని ఏ విషయంలోనూ తక్కువగా చూడకూడదనే ఆలోచనతో, వరుడి కుటుంబ స్థాయికి తగిన విధంగా కట్నకానుకలు, బంగారం సమకూర్చి, నిశ్చితార్థం నుంచి వివాహం వరకు జరిగిన ప్రతి కార్యక్రమానికీ అయ్యే పూర్తి ఖర్చును మణిదీప్ కుమార్ ఒక్కరే భరించారు. వరుడి కుటుంబం నుంచి ఒక్క రూపాయి కూడా ఆర్థిక సహాయం తీసుకోకుండా తన సొంత సంపాదనతో అన్నీ నిర్వహించారు. వివాహానికి 1,500 మందికి పైగా అతిథులు హాజరైనా, ఎక్కడా ఏ లోటూ రానివ్వకుండా అందరికీ ఆతిథ్యమిచ్చి, నిశ్చితార్థం నుంచి పెళ్లి వరకు ప్రతి వేడుకను ఘనంగా నిర్వహించి చెల్లెలిని అత్తవారింటికి సాగనంపారు. తల్లిదండ్రులు విజయ్ కుమార్--సునీతలను తిరిగి తీసుకురాలేకపోయినా... తండ్రి ఉంటే చెల్లెలి కోసం ఏం చేసేవాడో, 28 ఏళ్ల చిన్న వయసులోనే అన్నగా మణిదీప్ చేసి చూపించాడు. "నీకు నేనున్నాను" అనే భరోసాను మాటల్లో కాదు... చేతల్లో నిరూపించాడు. రాఖీ అంటే కేవలం చెల్లెలు అన్న చేతికి కట్టే దారం కాదు. చెల్లెలి భవిష్యత్తుకు భరోసాగా నిలిచి, ఆమెకు రావాల్సిన వాటాను అందించి, జీవితంలో తక్కువ కాకుండా చూసి, తల్లిదండ్రుల స్థానంలో నిలిచే అన్న ప్రేమకు ప్రతీక.

**వయసు చిన్నదే... బాధ్యత మాత్రం ఓ తండ్రిది.**

**చెల్లెలికి అన్నీ తానై నిలిచిన మణిదీప్ కుమార్ --- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి నిలువెత్తు నిదర్శనం.**

# అరవింద స్కూల్లో రాఖీ వేడుకలు

రంగశాయిపేట లోని అరవింద పబ్లిక్ స్కూల్ లో విద్యార్థులు గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, రక్షణకు ప్రతీకగా ఈ రక్షాబంధన్ పండుగను జరుపుకుంటామని అన్నారు. సోదరుడు తన సోదరిని ఎల్లప్పుడూ గౌరవిస్తూ, అవసరమైనప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చేదని అన్నారు. కష్ట సమయంలో అండగా నిలవడం ఈ పండుగ యొక్క అసలైన సందేశం.ఈ రక్షాబంధన్ పండుగ మీ అందరి జీవితాల్లో ప్రేమ, ఆనందం, ఐక్యత, సంతోషాలను నింపాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు, విద్యార్థిని విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



# చింతకాని మండలంలో పర్యటించిన మాజీ ఎంపీ నామ





**నూతన వధూవరులకు నామ ఆశీస్సులు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 28( భద్రాద్రిన్యూస్ ):-**

బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం చింతకాని మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా నేరేడ గ్రామ వాస్తవ్యులు నన్నక కోటయ్య కుమారుడు రవితేజ వివాహం బోనకల్ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముత్తం శ్రీనివాసరావు--శిరీష దంపతుల కుమార్తె సింధుతో గురువారం ఉదయం జరిగిన నేపథ్యంలో, నూతన వధూవరుల స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమంలో నామ పాల్గొన్నారు. స్వామివారి ప్రసాదం స్వీకరించి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వారికి వస్త్రాలను బహూకరించారు.

**నామకు రాఖీలు కట్టిన మహిళలు**

అనంతరం ఆ గ్రామంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన పలువురు మహిళలు రాఖీ పండుగ సందర్భంగా నామ నాగేశ్వరరావుకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు స్వీట్ తినిపించి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావుతో స్థానికులు ఉత్సాహంగా ఫొటోలు దిగారు.

**గురిజాల హనుమంతరావును పరామర్శించిన నామ**

అంతకుముందు చింతకాని మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు ఇటీవల చిన్న శస్త్రచికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న నామ నాగేశ్వరరావు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో బాణాల వెంకటేశ్వర్లు, మోరంపూడి ప్రసాదరావు, మంకెన రమేష్, వంకాయలపాటి లచ్చయ్య, తన్నీరు రవి, బొడ్డు వెంకటరామయ్య, గడ్డం శ్రీనివాసరావు, చాట్ల సురేష్, పోట్ల సీతయ్య, చెవుల ప్రసాద్, సోమా నాగేశ్వరరావు, సామినేని అప్పారావు, తుమ్మలపల్లి శ్రీనివాసరావు, పాల్నిడి కొండలరావు, సరిపూడి గోపి సందేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అన్నా చెల్లెల్ల.... అనుభందాల వేడుక

**ఇంటింటా రాఖీ ల కానుక**
**బల పడుతున్న బంధాలు**
**బుడ్డోల్ల... ముచ్చట... చూడ ముచ్చటే..**
**బొట్టు పెట్టి... హారతులు ఇచ్చి....**











**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు 28 (భద్రాద్రి న్యూస్):-**

రాఖీల సంబరం అంబరా న్నటింది. అన్నాచెల్లెళ్ల అనుబంధ వేడుక రాఖీలతో కానుకలు ఇచ్చి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అక్క చెల్లెలు అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు. రెండు రోజుల ముందే భద్రాద్రి జిల్లా రాఖీల షాపులతో సందడిగా మారింది బస్సులు రైలు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఉదయం నుండి స్థానికంగా ఆటోలు కిటకిటలాడిపోయాయి స్వీట్ కోట్లు పూల కోట్లు రాఖీ షాపులు బిజీగా ఉండటంతో ఆడపడుచులు బిజీ అయ్యారు.



**బుడ్డోల్ల ముచ్చటే సందడి**

రాఖీల పండుగలో చిన్నారుల సందడి ఇంటింటా ఆనందాన్ని నింపింది నెలలు పిల్లోడు దగ్గరనుంచి ఐదేళ్ల చిన్నారుల సైతం తమ్ముళ్లకు అన్నలకు రాఖీలు కట్టి కానుకలు తీసుకున్నారు దీంతో ఇంటిలపారి రాఖీల పండుగ ఆనందాల వేడుకగా మారింది వృద్ధులు సైతం అన్నయ్యలకు రాఖీలు కట్టి పండగ జరుపుకున్నారు.

# కబ్జాలపై అధికారులు ఆరా తీత..



ఖిలా వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్ హవేలీ లోని బెస్తం చెరువు శిఖం భూములపై గత వారం రోజుల నుండి సాగుతున్న కబ్జాలపై ఖిలా వరంగల్ మండలం తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ ఆరా తీశారు.వార్త జాతీయ దినపత్రిక లో గత రెండు రోజులుగా వస్తున్నా చెరువు శిఖం భూమి కబ్జా శీర్షిక కథనాలపై రెవెన్యూ అధికారులు స్పందించారు.గురువారం మండల రెవెన్యూ బృందం తో కలిసి బెస్తం చెరువు శిఖం భూముల కబ్జాలపై విచారణ చేపట్టారు. శిఖం భూములు ఎక్కడి వరకు ఉన్నాయి.ఎవరు కబ్జా చేశారనే కోణంలో రెవెన్యూ అధికారులతో కలిసి చర్చించారు. విలువైన భూములను కాపాడడానికి తగిన చర్యలకు సిద్ధం అయినట్టు తెలిపారు. కాగా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టి కబ్జా జరిగిన ప్రాంతంలో చెరువు శిఖం భూమి ఎంత వరకు ఉంటుందో, ప్రైవేటు భూమి ఎక్కడి వరకు ఉంటుందో తెలుపాలని కోరినట్టు సమాచారం. అలాగే చెరువు శిఖం భూముల వరకు హద్దులు ఏర్పాటు చేసి ఆ భూముల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటుకు రంగం సిద్ధం చేయాలని సూచించినట్లు వెల్లడించారు.కాగా కబ్జా చేసినా వారి పైనా క్రిమినల్ కేసులు నమోదు చేయుటకు ఏర్పాట్లు చెస్తున్నట్లు తెలుస్తోంది.ఇక ముందు బెస్తం చెరువు శిఖం భూములు కబ్జా జరుగకుండా నక్షా మ్యాప్ తో హద్దులు కూడా ఏర్పాటు చేస్తామని స్థానికులకు వివరించినట్టు వెల్లడించారు.

# గుర్తు తెలియని వ్యక్తి మహిళను ఢీ

**- మహిళ పరిస్థితి విషమం**

**చంద్రుగొండ/ జూలూరుపాడు (భద్రాద్రి న్యూస్) ప్రతినిధి:**

ఓ మహిళకు స్కూటీ తో ఢీకొన్న ఘటన మండలంలోని రావికంపాడు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శివరామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని రావికంపాడు గ్రామం వద్ద 27.08.2026 నా రాత్రి సమయంలో ఒక గుర్తుతెలియని వ్యక్తి స్కూటీని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఓ మహిళను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆ మహిళకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఖమ్మంలో చికిత్స పొందుతూ విషమ పరిస్థితిలో ఉన్నారని ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.ఈ ఘటనపై ఎస్సై విచారణ చేపట్టారు. వాహనదారులు రోడ్లపై ప్రయాణించే సమయంలో అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు పాల్పడకుండా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా వాహనాలు నడపాలని ఎస్సై శివరామకృష్ణ సూచించారు.